

పోటెత్తిన పోలింగ్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. జిల్లాలో మొత్తం 87.09శాతం ఓటింగ్ నమోదైంది. - 8లో



బోయకొండలో అగ్నిప్రమాదం

బోయకొండ గంగమ్మ ఆలయ కార్యాలయంలో మంగళవారం వేకువజామున అగ్నిప్రమాదం సంభవించింది. - 8లో



తిరుపతిలో జాతర డప్పు దరువు

తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మ జాతరకు కైకాల వంశస్తులు మంగళవారం చాటింపు వేశారు. - 8లో

న్యూస్‌రీల్

జూన్ 1 నుంచి కొత్త భవనంలో జిల్లా కోర్టు



చిత్తూరులోని నూతన కోర్టు కాంప్లెక్సు

చిత్తూరు అర్బన్: నగరంలోని హైరోడ్డులో నిర్మించిన నూతన కోర్టు కాంప్లెక్స్‌లో జూన్ 1వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో పరిపాలన కొనసాగించనున్నారు. దాదాపు రూ.42 కోట్ల వ్యయంతో 15 న్యాయస్థానాలు ఒకే భవనంలో ఉండేలా నిర్మించిన సముదాయాన్ని సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇటీవలే ప్రారంభించారు. ఈనెల 29 నుంచి 31వ తేదీలోపు నగరంలోని ఎస్టేట్‌లో ఉన్న న్యాయస్థానాల కేసు రికార్డులను, కొత్త భవనంలోకి తరలించాలని జిల్లా జడ్జి భీమారావు అధికారులను ఆదేశించారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు



స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ వేస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలను మంగళవారం తరలించారు. జిల్లాఎన్నికల అధికారి షణ్మోహన్ మాట్లాడుతూ పోలింగ్ అనంతరం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు కట్టుదిట్ట బందోబస్తు నడుమ తరలించినట్లు తెలిపారు. అబ్జర్వర్‌లు, ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంల పరిశీలన నిర్వహించామన్నారు. పుంగనూరు, నగరి, జీడీ నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని వెల్లడించారు. కార్యక్రమంలో అబ్జర్వర్లు షాదిక్ అలం, కై లాష్ వాంఖడే, చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌ఓలు మధుసూదన్‌రెడ్డి, వెంకటశివ, చిన్నయ్య, మనోజ్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పాల్గొన్నారు.

సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు



షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించిన అధికారులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. ఇందుకు సహకరించిన నోడల్ అధికారులు, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఎంపీడీఓలు, పీఓ లు, పోలీస్ అధికారులు, కేంద్ర బలగాలు, ఓటర్లు, రాజకీయ పార్టీలు, మీడియాకు ధన్యవాదాలని వివరించారు. జిల్లాలో ఎక్కడా రీ పోలింగ్ లేదని స్పష్టం చేశారు. అన్ని నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించి పకడ్బందీగా భద్రపరిచామని వెల్లడించారు.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సరానికి పీజీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రమాశ్రీ తెలిపారు. ప్రధానంగా ఆచార్య, ఎంఏ శబ్ద బోధ, ఎంఏ హిందీ, ఎమ్మెస్సీ యోగా థెరపీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులలో అడ్మిషన్లు పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ప్రవేశపరీక్ష పాసైన అభ్యర్థులు మాత్రమే పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా రెగ్యులర్ పద్ధతిలో ప్రాక్శాస్త్రి కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హతతో పాటు మరిన్ని వివరాలకు httpr://nrktu.ac.in వెబ్సైట్‌ను పరిశీలించాలని ఆమె కోరారు.

నేడు 'కోన'లో హుండీ లెక్కింపు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయ స్వామి దేవస్థానాల్లోని హుండీ కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. అలాగే గురువారం పెంచలకోన బ్రహ్మోత్సవాలపై నెల్లూరు జిల్లా ఆర్డీఓ, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

పచ్చమూకల స్వైరవిహారం

చంద్రబాబు పదవీ వ్యామోహం.. పలువురిని గాయపరిచింది. ఆయన అధికార దాహం.. పలు చోట్ల హింసాత్మక ఘటనలకు దారితీసింది.. ఆయనలో తలెత్తిన ఓటమి భయం.. ప్రత్యర్థులపై దాడులకు పురిగొల్పింది. అధినేత కక్షపూరిత ప్రసంగాలు అనుయాయులను రెచ్చగొట్టాయి. ఈక్రమంలోనే పోలింగ్ రోజున ఓటరు నాడి పసిగట్టిన పచ్చమూకలు అల్లర్లకు దిగాయి. ఎక్కడికక్కడ 'ఫ్యాను' సానుభూతిపరులపై దాడులకు పాల్పడ్డాయి. ఓటేయలేదని దళితులు.. ప్రజాదరణ పొందుతున్నారని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై సైతం దౌర్జన్యాలకు తెగబడ్డాయి. వ్యతిరేక పవనాలు వీస్తున్నాయనే అక్కసుతో పథకం ప్రకారం అడుగడుగునా అరాచకాలు సృష్టించాయి.

- ఓటమి భయంతో దాడులకు దిగిన టీడీపీ నేతలు
- పథకం ప్రకారం పలు చోట్ల అల్లర్లు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపైనా దౌర్జన్యాలు
- అర్ధరాత్రి దళితుల ఇళ్లలోకి చొరబడి అరాచకాలు



చిత్తూరులో పోలీసులపై టీడీపీ అభ్యర్థి జగన్‌మోహన్ నాయుడు రుబాబు



చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో దొంగ ఓట్లు వేస్తున్న టీడీపీ శ్రేణులను అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లాలో మునుపెన్నడూలేని విధంగా ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపిన దళితులు, ఇతర వర్గాలపై టీడీపీ శ్రేణులు అక్కసు వెళ్లగక్కాయి. ఓడిపోతున్నామనే భయం టీడీపీ నేతలకు నిద్రపట్టకుండా చేసింది. చిత్తూరు, తిరుపతి జిల్లా లోని పలు చోట్ల మంగళవారం తెల్లవారుజాము వరకు టీడీపీ నేతల అరాచకాలు కొనసాగాయి.

జీడీ నెల్లూరులో తమిళ రౌడీలు

ప్రశాంత వాతావరణానికి మారుపేరైన గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఈ పర్యాయం టీడీపీ తమ అభ్యర్థిగా వివాదస్పదుడైన థామస్‌ను బరిలోకి దింపింది. సామాజికవర్గం, విద్యార్హత, మతం, హత్యారోపణలు, విచ్చలవిడిగా నగదు పంపిణీ తదితర ఆపవాదులు మూటగట్టుకున్న థామస్.. పోలింగ్ వేళ నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఓటుహక్కు లేనివాళ్లు జిల్లాలో ఉండొద్దని, తప్పనిసరైతే ఇళ్లలోనే ఉండాలని స్వయానా జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ ఆదేశాలను సైతం బేఖాతర్ చేశారు. తమిళనాడు నుంచి రౌడీలు, బౌన్సర్లను పెద్ద సంఖ్యలో జీడీనెల్లూరుకు తీసుకువచ్చారు. పోలింగ్ రోజున బూత్‌ల వద్ద తమిళ రౌడీలతో హల్‌చల్ చేశారు. ప్రశాంతంగా సాగుతున్న పోలింగ్‌ను ఉద్రిక్తంగా మార్చారు. జీడీ నెల్లూరులోని జంగాలపల్లెలో థామస్ వ్యక్తిగత కార్యదర్శి దాము ఏకంగా పోలింగ్ కేంద్రంలోకి చొరబడి తలుపులు వేసుకుని రిగ్గింగ్‌కు ప్రయత్నించాడు. ఇక ఎస్ఆర్ పురం మండలంలోని పుల్లూరుకు చెందిన దళితులు తమ పార్టీకి ఓటేయలేదనే సాకుతో సోమవారం రాత్రి కమ్మ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలు సుమారు 20 మంది దళితులను నిర్బంధించారు. అనంతరం పుల్లూరులోని దళితుల ఇళ్లలోకి చొరబడి విధ్వంసకాండకు పాల్పడ్డారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులపై దాడులకు దిగారు. తన రెండు నెలల పాపతో నిద్రిస్తున్న ఓ బాలింతను కాలితో తన్ని, ఆమె మెడలోని మంగళసూత్రం సైతం లాక్కెళ్లిపోయారు. దళితులను చితకబాదారు. అర్ధరాత్రి వరకు ఈ దాడులు కొనసాగాయి.



చిల్లకూరు జెడ్పీ స్కూల్ వద్ద టీడీపీ శ్రేణుల వీరంగం

అభ్యర్థులపై దౌర్జన్యం

చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాలలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్ సురేష్‌ను హతమార్చేందుకు ముందస్తుగా ప్రణాళిక వేసిన టీడీపీ నేతలు పోలింగ్ కేంద్రంలోకి కత్తులతో వెళ్లి కూర్చున్నారు. బయటకు వచ్చిన సురేష్‌ను హత్య చేస్తే, మందికృష్ణాపురంలో తమకు అడ్డు ఉండదని భావించి కత్తితో పొడిచేశారు. ఇక కుప్పంలో పోలింగ్ సరళి పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్‌పై శాంతిపురంలో టీడీపీ మూకలు దాడికి ప్రయత్నించాయి. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్‌పై టీడీపీ శ్రేణులు రాళ్లతో దాడికి యత్నించాయి. చిల్లకూరు దర్గా సమీపంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రానికి వెళ్లిన మేరిగ మురళీధరతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పట్టాభిరెడ్డి దురుసుగా ప్రవర్తించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అన్ని బూత్‌లు పరిశీలించేందుకు హక్కు ఉందని చెబుతుండగానే మేరిగ మురళిని పక్కకు తోసేశారు. అదే సమయంలో టీడీపీ కార్యకర్త సైతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపైకి రాయి విసిరాడు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి రౌడీయిజం ప్రదర్శిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు యత్నించారు. అడ్డొచ్చిన పోలీసులకు, పోలింగ్ అధికారులకు అంతు చూస్తామని వార్నింగ్ ఇచ్చారు.

చంద్రగిరిలో చిత్తూరు రౌడీయిజం

- వందలాది మంది టీడీపీ రౌడీల తిష్ట
- రెచ్చగొట్టి.. అల్లర్లు సృష్టించడమే పనిగే నాని అనుచరుల ఆగడాలు
- నామినేషన్స్ రోజున ఆర్డీఓ కార్యాలయం వద్ద దాడులు ప్లాన్‌లో భాగమే
- పోలింగ్ రోజున చంద్రగిరి నియోజకవర్గంలో విధ్వంసం వెనుక ఎన్నో అనుమానాలు

సాక్షి, తిరుపతి: ఓటమి భయంతో కూటమి అభ్యర్థులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి పోలింగ్ శాతాన్ని తగ్గించాలని పక్కా ప్లాన్‌తో విధ్వంసాలు సృష్టించారు.

అల్లర్లు సృష్టించి..అసత్యాలకు పదును పెట్టి

ఎన్నికల్లో అల్లర్లు, విధ్వంసాలు సృష్టించేందుకు కూటమి అభ్యర్థులు నోటిఫికేషన్ వెలువడకముందు నుంచే విధ్వంసాలకు పథక రచన చేశారు. అందులో భాగంగానే నామినేషన్ రోజున ఆర్డీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వాహనంపై దాడికి తెగబడ్డారు. ఆపై విచక్షణారహితంగా పోలీసులపైన, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్ల వర్షం కురిపించారు. మరోవైపు తిరుపతి నగరంలో జరుగుతున్న ప్రచారంలో జనసేన రౌడీలు స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపైన దాడులకు తెగబడ్డారు. ఇదంతా కుట్రలో భాగమేనని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

రిగ్గింగ్‌ని అడ్డుకున్నందుకే విధ్వంసాలు

పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గ ఓటర్లంతా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికే పట్టం కడుతున్నారన్న విషయాన్ని గ్రహించిన కూటమి అభ్యర్థి పులివర్తి నాని అనుచరులు రామచంద్రాపురం మండలం, బ్రాహ్మణకాలువ పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్‌కు యత్నించారు. తమకు అడ్డుగా ఉన్న దళిత ఏజెంట్‌ని బయటకు లాక్కొచ్చి అతనిపై దాడిచేశారు. వైఎస్సార్‌సీపీ పాకాల మండల పార్టీ అధ్యక్షులు నంగా నరేష్‌రెడ్డి కుమారుడు లవంత్‌రెడ్డిపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. తర్వాత పులివర్తివారి పల్లెలో రిగ్గింగ్‌కు యత్నించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై మాజీ జెడ్పీటీసీ సురేష్‌చౌదరి, పులివర్తి నాని కుమారుడు వినీల్ దాడికి దిగారు. నారావారిపల్లె పరిధిలోని పోలింగ్ కేంద్రంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పైనా టీడీపీ మూకలు దాడిచేశారు. అదేవిధంగా కూచువారిపల్లె పరిధిలోని పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్‌కి అడ్డుగా ఉన్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్ రాజశేఖర్‌ని, రిలీవ్ ఏజెంట్‌గా ఉన్న సర్పంచ్ కొట్టాల చంద్రశేఖర్‌రెడ్డిపై దాడి చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని ధ్వంసం చేశారు. గ్రామానికి చేరుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై దౌర్జన్యానికి దిగారు. మోహిత్‌రెడ్డి వాహనానికి నిప్పు పెట్టి, మరో ఎస్కార్ట్ వాహనాన్ని ధ్వంసం చేశారు. కార్యకర్తలపై దౌర్జన్యం చేశారు. కూచువారిపల్లెలో కార్యకర్తలను బేడ్లతో కోసి రక్త గాయాలు చేశారు.



మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూం సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కారును ధ్వంసం చేసిన అల్లరిమూకలు



తిరుమల నగర్ పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మొదలియార్ రమేష్‌పై దాడి చేస్తున్న టీడీపీ గూండాలు

అక్కడే ఎందుకు తిష్ట?

పోలింగ్ రోజున ఎటూ ఓటింగ్ శాతాన్ని తగ్గించలేకపోయామని భావించిన కూటమి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని అనుచరులు రెచ్చిపోతున్నారు. మహిళా విశ్వవిద్యాలయం ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉండగా స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో పులివర్తి నాని అనుచరులు మారణాయుధాలతో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిధిలో ఉన్న రౌడీ మూకలు మహిళా యూనివర్సిటీ సమీపంలో వైఎస్సార్‌సీపీ స్టిక్కర్‌తో ఉన్న ద్విచక్ర వాహనాన్ని కిందపడేసి ధ్వంసం చేశారు. ఆపై దానికి నిప్పంటించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకుడికి కారును కూడా ధ్వంసం చేశారు.



వీరంగం సృష్టిస్తున్న టీడీపీ గూండాలు



ధ్వంసమైన పోలీసు వాహనం

దళితులపై దాడులను సహించం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం : దళితులపై దాడులు చేస్తే సహించే ప్రసక్తే లేదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి టీడీపీ నేతల దాడిలో భయాందోళనకు గురైన దళితులను ఆయన పరామర్శించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పుల్లూరు దళితవాడను ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి సందర్శించారు. పచ్చమూకల దాడిలో ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను ఓదార్చారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ టీడీపీకి ఓటేయకుంటే దళితులను కొడతారా అని మండిపడ్డారు. టీడీపీకి, చంద్రబాబుకు దళితులంటే మొదటి నుంచి చిన్నచూపే అన్నారు. అందులో భాగంగానే కొందరు కులోన్మాదులు ఇలాంటి కిరాతక చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిద్రిస్తున్న దళితులపై దాదాపు 100 మంది టీడీపీ గూండాలు విరుచుకుపడి విచక్షణా రహితంగా దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా టీడీపీకి ఓటేయలేదని పాదురుకుప్పం దళితవాడని కాల్చేసిన నీచమైన చరిత్ర పచ్చనేతలకు ఉందని వెల్లడించారు. టీడీపీ మూకలు దాడులకు పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం దారుణమన్నారు. పోలింగ్ రోజున కూడా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. టీడీపీ నేతల దాడిపై బాధితులు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ నిందితులను అరెస్ట్ చేయకపోవడం దేనికి సంకేతమిస్తుందని ప్రశ్నించారు. పచ్చమూకల అరాచకాలపై ఎస్పీ, డీఎస్పీకి ఫిర్యాదు చేసినా స్పందించలేదంటే, దళితులపై ఎలాంటి వివక్ష చూపుతున్నారో అర్థమవుతోందని మండిపడ్డారు. చంద్రబాబుకు పోలీసులు తొత్తులుగా మారిపోయారా.. సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం బాధిత దళితులకు రూ.25వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

ఓర్వలేకే టీడీపీ దాడులు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీకి దక్కుతున్న ప్రజాదరణను ఓర్వలేకే టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారని చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ మండిపడ్డారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. మండలంలోని నలగాంపల్లెలో సోమవారం రాత్రి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభునాయుడు, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, సీనియర్ నాయకుడు థామస్, వైఎస్సార్‌సీపీ ఏజంట్లపై టీడీపీ నాయకులు జయప్రకాష్, విక్రమ్ ఆధ్వర్యంలో దాడులకు పాల్పడ్డారన్నారు. థామస్‌కు చెందిన కారు అద్దాలను పగులగొట్టారని ఆరోపించారు. మొట్టమొదటి సారిగా నలగాంపల్లెలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయన్నారు. దళితులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వచ్ఛందంగా వచ్చారనే అక్కసుతో టీడీపీ నాయకులు దాడి చేసి ముగ్గురిని గాయపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, ఏజెంట్లపై టీడీపీ నాయకులు దాడులకు తెగబడ్డారని వెల్లడించారు. పచ్చమూకలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో పాలఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ప్రభునాయుడు పాల్గొన్నారు.

ఓటేయని 'ఆరణి'

చిత్తూరు అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తన ఓటు హక్కు వినియోగించుకోవడంలో విఫలమయ్యారు. చిత్తూరు నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఆయన ఓటు వేయాల్సి ఉంది. అయితే పోలింగ్ రోజున ఆరణి ఓటేయలేదు.. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వ్యక్తి ప్రజాప్రతినిధిగా సమాజానికి ఎలాంటి సందేశమిస్తారని పలువురు మండిపడుతున్నారు. ఓటేయని వ్యక్తి.. తనకు ఓటేసి గెలిపించాలని ఎలా కోరుతారని ఎద్దేవా చేస్తున్నారు.

క్లుప్తంగా

పంటలపై గజ దాడులు



నాగంవాండ్లపల్లెలో ఏనుగులు నాశనం చేసిన పంటను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ

ఐరాల: మండలంలోని రంగమ్మ చెరువు, నాగంవాండ్లపల్లె, యదర్లపల్లెలో పంట పొలాలపై సోమవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. బాబు, కృష్ణమూర్తి, దేవరాజు, రఫీ, మునిరత్నం, జిందా, రామూర్తి, కిరణ్ అనే రైతులకు చెందిన వరి, టమాట పంటలను తొక్కి నాశనం చేశాయి. మామిడి చెట్లను విరి చేశాయి. ఏనుగుల కారణంగా సుమారు రూ.2లక్షల పంట నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చే దశలో పంట నష్టపోయినట్లు వాపోయారు. అటవీ శాఖ అధికారి జయశేఖర్ ఆయా గ్రామాలకు చేరుకుని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

యువకుడి ఆత్మహత్య

గుడిపాల: మండలంలోని నరహరిపేట చెక్ పోస్టు సమీపంలో ఓ యువకుడు మంగళవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కుప్పిగానిపల్లెకు చెందిన ఏసు కుమారుడు విజయ్(24) పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో విజయ్ ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

టీడీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

చిత్తూరు రూరల్(కాణిపాకం): మండలంలోని పెరుమాళ్లకండ్రిగ గ్రామంలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసిన 15 మంది టీడీపీ నేతలపై బీఎన్ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు తులసీపతి నాయుడు, రవికుమార్, సుదీర్, సురేష్, గణేష్‌లతో పాటు 10మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపారు. అలాగే టీడీపీ నేతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, శిరీష, అమర్‌నాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కృష్ణమూర్తి, వేలుస్వామిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. తిరుపతికి చెందిన వెంకటేష్(21), మోహన్‌రాజ్(23) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీకి సమీపంలో ముందువెళుతున్న లారీని అధిగమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు చెప్పారు.

పోటెత్తిన పోలింగ్



కౌంటింగ్ కేంద్రం కు చేరిన ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్



అధికారుల పర్యవేక్షణలో ఈవీఎంలు భద్రపరిచిన రూముకు సీల్ వేస్తున్న సిబ్బంది

- జిల్లాలో మొత్తం 87.09 శాతం నమోదు
- 13వ తేదీ అర్ధరాత్రి వరకు పలుచోట్ల కొనసాగిన పోలింగ్
- ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించిన అధికారులు
- అభ్యర్థులు.. అబ్జర్వర్ల సమక్షంలో సీల్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యింది. ఓటింగ్ శాతం 2019 ఎన్నికలకంటే అధికంగా నమోదైంది. జిల్లాలోని కుప్పం, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో అధికంగా పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉండడంతో సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల వరకు వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఆయా నియోజకవర్గాల అధికారులు ఈవీఎంలతో జిల్లా కేంద్రంలోని ఎస్వీసెట్ కౌంటింగ్ కేంద్రానికి మంగళవారం మధ్యాహ్నానికి చేరుకున్నారు. ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు, అబ్జర్వర్ల సమక్షంలో స్క్రూటినీ నిర్వహించి గోడౌన్‌లో భద్రపరిచి సీల్ వేశారు. అనంతరం పోలింగ్ శాతం వివరాలను విడుదల చేశారు. మొత్తం ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ పర్యవేక్షించారు.

గత ఎన్నికల కంటే 2.07 శాతం ఎక్కువ

2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే ప్రస్తుతం జిల్లాలో ఓటింగ్ శాతం 2.07 శాతం పెరిగింది. గతంలో 85.02 శాతం ఓటింగ్ నమోదు కాగా, ప్రస్తుతం 87.09 శాతం నమోదైంది. ఈ ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,63,911 మంది ఓటర్లుండగా 13,62,008 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 6,74,454 మంది, మహిళలు 6,87,519 మంది ఓటేసినట్లు అధికారులు వివరించారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటింగ్ శాతం ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
పుంగనూరు	2,38,868	2,06,916	86.62
నగరి	2,02,574	1,76,399	87.08
జీడీ నెల్లూరు	2,04,949	1,81,779	88.69
చిత్తూరు	2,02,850	1,64,788	81.24
పూతలపట్టు	2,20,999	1,93,730	87.66
పలమనేరు	2,67,896	2,35,476	87.9
కుప్పం	2,25,775	2,02,920	89.88
మొత్తం	15,63,911	13,62,008	87.09

చిత్తూరు పార్లమెంట్ సెగ్మెంట్ ఓటింగ్ శాతం ఇలా

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
చంద్రగిరి	3,15,159	2,51,797	79.90
నగరి	2,02,574	1,76,399	87.08
జీడీ నెల్లూరు	2,04,949	1,81,779	88.69
చిత్తూరు	2,02,850	1,64,788	81.24
పూతలపట్టు	2,20,999	1,93,730	87.66
పలమనేరు	2,67,896	2,35,476	87.9
కుప్పం	2,25,775	2,02,920	89.88
మొత్తం	16,40,202	14,06,880	85.77

అత్యధికంగా కుప్పంలో 89.88 శాతం

కుప్పం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో అత్యధికంగా 89.88 శాతం పోలింగ్ నమోదైంది. చిత్తూరు నియోజకవర్గంలో అత్యల్పంగా 81.24 శాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 80 శాతానికి పైగానే పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా పలమనేరు నియోజకవర్గంలో ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,67,896 మంది ఓటర్లకు గాను, 2,35,476 మంది ఓటేశారు.

జూన్ 4న కౌంటింగ్

పోలింగ్ పూర్తి కావడంతో అభ్యర్థులు క్షేత్రస్థాయిలో పరిస్థితిపై దృష్టి పెట్టారు. పోలింగ్ కేంద్రాల వారీగా తమకు ఎన్ని ఓట్లు వస్తాయనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో జూన్ 4వ తేదీన కౌంటింగ్ రోజున అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

పకడ్బందీగా ఈవీఎంల భద్రత

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తీసువచ్చాం. అభ్యర్థుల సమక్షంలోనే వాటిని రూమ్‌లోకి తరలించి సీల్ కూడా వేశాం. ఆయా నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను పకడ్బందీగా భద్రపరిచాం. స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తును కట్టుదిట్టంగా ఏర్పాటు చేశాం. – షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి





సార్వత్రిక పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తడంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని ధీమాగా చెబుతున్నారు. సంక్షేమ పథకాలే విజయతీరాలకు చేరుస్తున్నాయని వెల్లడిస్తున్నారు. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు.. వృద్ధులు పెద్దసంఖ్యలో ఓటేసేందుకు తరలివచ్చారని వివరిస్తున్నారు. బడుగు బలహీనవర్గాలు సైతం ఫ్యానుకే వైపే మొగ్గుచూపారని విశ్లేషిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో జోష్

- సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ధీమా వ్యక్తం చేస్తున్న నేతలు
- మండలాల వారీగా మెజారిటీపై లెక్కలు

సాక్షి, చిత్తూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనే తమకు శ్రీరామ రక్ష అని వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. పోలింగ్ సరళి తమకే అనుకూలంగా ఉందని వైఎస్సార్‌సీపీ భావిస్తున్నాయి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఓటేసేందుకు పోటెత్తడంతో తమ గెలుపు నల్లేరేపై నడకేనని వివరిస్తున్నాయి.

కుప్పంలోనూ ధీమా

ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నువ్వానేనా?అన్నట్టు పోరు ఉంది. కానీ ఈసారి ఫ్యాన్ హవా కనిపిస్తోందని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఎమ్మెల్సీగా భరత్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడం తమకు లాభిస్తోందని వెల్లడిస్తున్నారు. అలాగే సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం, కృష్ణాజలాలు రప్పించడం సైతం అనుకూల ఫలితాలకు మార్గం సుగమం చేసిందని వివరిస్తున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం చంద్రబాబే గెలుస్తారని, మెజారిటీ తగ్గవచ్చని చెప్పుకొస్తున్నారు.

పుంగనూరు.. మరో మాట లేదు

పుంగనూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విజయం ఖాయమైందని ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన నిత్యం ప్రజలతో మమేకం కావడం, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం విజయానికి దోహదపడ్డాయని వెల్లడిస్తున్నారు.

చిత్తూరులోనూ మెరుగైన ఫలితం

చిత్తూరులో ఫ్యాన్ హవా కనిపిస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయా డెయిరీ పునః ప్రారంభానికి శ్రీకారం చుట్టడం, చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు చెల్లించడం, నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం తమకు అనుకూలంగా మారిందని వైఎస్సార్‌సీపీ నేతలు వెల్లడిస్తునానరు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి సైతం తన వంతు సేవాకార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలవడంతో మెరుగైన ఫలితం వస్తుందని వివరిస్తున్నారు.

జీడీ నెల్లూరులో కలిసొచ్చే కాలం

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రిగా నారాయణస్వామి చేపట్టిన అభివృద్ధి ఆయన కుమార్తె, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి కలిసొచ్చే కాలం తీసుకువచ్చింది. టీడీపీ అభ్యర్థి థామస్ స్థానికంగా లేకపోవడం కూడా అనుకూలంగా మారనుంది.

పూతలపట్టులో విజయావకాశం

పూతలపట్టు నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొడుతుందని ఆ పార్టీ నేతలు తెలియజేస్తున్నారు. ప్రత్యేకించి మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల కారణంగా విజయావకాశాలు మెరుగుపడినట్టు వివరిస్తున్నారు.

నగరిలో నల్లేరుపై నడకే..

నగరిలో విజయంపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆర్‌కే రోజా ధీమాగా ఉన్నారు. మహిళల ఓట్లు అధిక శాతం పోల్ కావడం ఆమెకు కలిసొచ్చే అంశం కానుందని ఆ పార్టీ నేతలు వివరిస్తున్నారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో విస్తృతంగా అందించిన సేవల కారణంగా మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని వెల్లడిస్తున్నారు. విజయం నల్లేరుపై నడకేనని చెబుతున్నారు.

పలమనేరు.. అదే జోరు

పలమనేరు నియోజకవర్గం ఓటర్లు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టే అవకాశాలున్నాయని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. పోలింగ్ రోజున మహిళలు, వృద్ధులు అధికంగా ఓటింగ్‌లో పాల్గొనడంతో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని వివరిస్తున్నారు.

బోయకొండలో అగ్నిప్రమాదం





బోయకొండ ఆలయ కార్యాలయంలో కాలిపోయిన సామగ్రి పరిశీలిస్తున్న చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి తదితరులు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయ కార్యాలయంలో మంగళవారం వేకువజామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. వివరాలు.. సోమవారం రాత్రి బోయకొండలో పిడుగులతో కూడిన వర్షం పడింది. ఈక్రమంలో ఆలయ కార్యాలయం సమీపంలో పిడుగులు పడడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో మంటలు చెలరేగి కార్యాలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారి చిత్రపటంతోపాటు ఫర్నిచర్ కాలి బూడిదయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. త్వరితగతిన కార్యాలయానికి మరమ్మతులు చేయించాలని చైర్మన్ ఆదేశించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే వేకువజామున 3 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవిస్తే ఉదయం వరకు గుర్తించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నా ప్రమాద జరిగిన విషయాన్ని ఉదయం 7 గంటల వరకు కనిపెట్టకపోవడం గమనార్హం.

వెకేషన్ కోర్టు షెడ్యూల్ విడుదల



నరసింహమూర్తి, న్యాయమూర్తి

తిరుపతి లీగల్: జిల్లా జడ్జి కోర్టులకు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఈనెల 14 నుంచి వేసవి సెలవులు ప్రారంభం కావడంతో అత్యవసర కేసులను దాఖలు చేసి ఉత్తర్వులు పొందడానికి రాష్ట్ర హైకోర్టు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెకేషన్ కోర్టులను ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల విచారణ ప్రత్యేక సెషన్స్ కోర్టు జడ్జి, మొదటి విడత వెకేషన్ కోర్టు జడ్జి ఏ.నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. ఈనెల 14 నుంచి 29వ తేదీ వరకు మొదటి విడతగా, ఈ నెల 30 నుంచి జూన్ 14వ తేదీ వరకు రెండో విడతగా విభజిస్తూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. మొదటి విడత వెకేషన్ కోర్టు తిరుపతిలో ఈ నెల 14, 21, 28 తేదీల్లోనూ, చిత్తూరులో ఈ నెల 15, 22, 29 తేదీల్లోనూ, శ్రీకాళహస్తిలో ఈ నెల 16, 23 తేదీల్లోనూ, మదనపల్లిలో ఈ నెల 17, 24 తేదీల్లోనూ, పీలేరులో ఈ నెల 20, 27 తేదీల్లో విధులు నిర్వహించనున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు.

రెండో విడత

రెండో విడత వెకేషన్ కోర్టు షెడ్యూలు ఈ నెల 30 నుంచి జూన్ 14 వరకు విభజిస్తూ శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి, రెండో విడత వెకేషన్ కోర్టు జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాళహస్తిలో ఈ నెల 30, జూన్ 6, 13 తేదీల్లోనూ, చిత్తూరులో ఈ నెల 31, జూన్ 7, 14తేదీల్లోనూ, తిరుపతిలో జూన్ 3, 10 తేదీల్లోనూ, మదనపల్లిలో జూన్ 4, 11 తేదీల్లోనూ, పీలేరులో జూన్ 5, 12 తేదీల్లోనూ వెకేషన్ కోర్టు విధులు నిర్వహించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోర్టులకు సెలవులు

ఈ నెల 13 నుంచి జూన్ 14వ తేదీ వరకు జిల్లా కోర్టులకు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు వేసవి సెలవులను రాష్ట్ర హైకోర్టు ప్రకటించింది. అలాగే ఈ నెల 20 నుంచి జూన్ 14వ తేదీ వరకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు వేసవి సెలవులను ప్రకటిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. సెలవుపై వెళ్లడానికి జిల్లా, సీనియర్ సివిల్ జడ్జీలకు 14 రోజుల పాటు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఓట్ల కోసం.. థామస్ కనికట్టు

- స్క్రాచ్ కార్డులతో మోసం



ఓటర్లకు పంపిణీ చేసిన స్క్రాచ్‌కార్డు

కార్వేటినగరం : టీడీపీ జీడీనెల్లూరు అభ్యర్థి థామస్ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు కొత్త మోసానికి తెరతీశారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఎస్సీ, ఎస్టీ కాలనీలను ఎంపిక చేసుకుని టీడీపీ కార్యకర్తలతో 500 అంకెతో ముద్రించిన పసుపురంగు స్క్రాచ్ కార్డులను ఇంటింటికీ పంపిణీచేశారు. వీటిని షాపింగ్‌మాల్ లేదా సూపర్ మార్కెట్‌కు తీసుకెళ్లి రూ.5వేలు విలువజేసే సరుకులు తీసుకోవచ్చని నమ్మబలికారు. లేకుంటే సైకిల్‌పై ఓటు వేసిన వెంటనే ఓటర్ల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని నమ్మించారు. దీంతో కొందరు నమ్మి ఓటు వేసిన తర్వాత తమ బ్యాలెన్స్ సరిచూసుకుంటే ఒక్క రూపాయికి జమ కాలేదు. దీంతో మాయలోడు థామస్‌కు ఓటు వేసినందుకు లబోదిబోమంటున్నారు. 2014 ఎన్నికల్లో పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు మహిళలను మోసం చేస్తే, ఈ ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ పసుపు కార్డులు అందించి కనికట్టు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ క్రమంలో పలువురు మాత్రం థామస్ మోసాన్ని గ్రహించారు. తమకు సంక్షేమ పథకాలు అందించిన పార్టీకే ఓటేశారు. దీనిపై ఆగ్రహించిన థామస్ తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీ అనుకూలంగా ఉండే ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లకు దిగారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విశ్వం సంచలనం



ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (ఏపీఆర్‌జేసీ)లలో ప్రవేశాలకు గత నెల 25వ తేదీన రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు మంగళవారం వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో పాటు వివిధ విభాగాల్లో పదిలోపు 9 ర్యాంకులను సాధించి సంచలన విజయం నమోదు చేశారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో పీ.హేమశ్రీ, కే.నిత్యశ్రీ కల్యాణి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు, ఓ.ధీరజ్ ద్వితీయ ర్యాంకు, పీ.మేఘన, ఆర్.మహితలు తృతీయ ర్యాంకు, కే.చరిత నాల్గో ర్యాంకు, ఆర్.రెడ్డిచరణ్‌రెడ్డి 5వ ర్యాంకు, సీ.లేఖన 6వ ర్యాంకు, డీ.నవదీప్ 7వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. పోటీ పరీక్ష లేదైనా తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తుండడం తాము అనుసరిస్తున్న విద్యాప్రమాణాలకు నిదర్శనమన్నారు. అనంతరం ప్రతిభకనబరిచిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథరెడ్డి అభినందించారు.

తిరుపతిలో జాతర డప్పు దరువు!



గంగమ్మ గుడి కొడిస్తంభానికి ఒడిబాల కడుతున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: 'ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా.. చాటింపుతో నేటి నుంచి తిరుపతి గంగజాతర ప్రారంభమైంది.. వారం రోజుల పాటు తిరుపతిలో గంగజాతర కొనసాగుతుంది.. కనుక నగరవాసులెవ్వరూ ఊరు వదలి వెళ్లరాదు.. ఇంతర ప్రాంతాల నుంచి వచ్చేవారు రాత్రి పూట ఇక్కడ బస చేయకుండా తిరిగి వెళ్లిపోవాలి.. జాతర ప్రారంభమైనందున అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహించుకోవాలహో...' అంటూ మంగళవారం కైకాల వంశస్థులు తిరుపతి గంగజాతర చాటింపు వేశారు. భేరీవీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించారు. అనంతరం నాటి నగర శివారు ప్రాంతాలైన నాలుగు కాళ్ల మండపం, హెడ్ పోస్టాఫీస్, కృష్ణాపురం ఠాణా, పాత మెటర్నటీ ఆస్పత్రి సర్కిల్ ప్రాంతాల్లో అర్ధరాత్రి అష్టదిగ్బంధన చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఆ చాటింపుతో తిరుపతి శ్రీతాతయ్యగుంట చిన్నగంగమ్మ(తిరుపతి గ్రామదేవత) జాతర వేడుకగా ఆరంభమైంది.

ఒడిబాల సమర్పణ

భక్తకోటి కోర్కెలు తీర్చే కల్పవల్లి, తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగ జాతర బుధవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనుంది. జాతర సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు ఆలయ అవరణలోనున్న అమ్మవారి విశ్వరూప కొడిస్తంభానికి అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు చేసి, ఒడిబాలు సమర్పించారు. అలాగే ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వాంగ సుందర అలంకరణలో అమ్మవారు వజ్రకిరీటం, బంగారు ముఖ కవచం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. జాతర ప్రారంభం సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వెయ్యి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు తీర్చుకున్నారు. మేయర్ డాక్టర్ శిరీష ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త



గాయపడిన స్వాతి

కాణిపాకం: భార్యపై భర్త కత్తితో దాడిచేసిన ఘటన మంగళవారం యాదమరి మండలం ముత్తరపల్లె బస్టాండు వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. గుడిపాల మండలం పేయనపల్లెకు చెందిన స్వాతి అదే గ్రామానికి చెందిన తన మేనమామ ఉమాపతిని కొన్నేళ్లకు క్రితం పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం వీరు జానకారపల్లెలో నివాసముంటున్నారు.ఉమాపతి ముత్తరపల్లెలో జేసీబీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అక్కడకు వెళ్లిన స్వాతి డబ్బుల కోసం వెళ్లి భర్తతో గొడవపడింది. దీంతో ఆగ్రహానికి గురైన భర్త కత్తితో విచక్షణా రహితంగా ఆమెపై దాడికి దిగాడు. చేయి, కాళ్లు, తలపై నరికి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. స్థానికులు ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్వాతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.